# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-01-2026                    సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- విద్యను సమాజానికి సేవ చేసే మార్గంలా భావించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు సూచించారు.
- భిన్న వైవిధ్యాలున్నప్పటికీ భారత్ లో ప్రజాస్వామ్యం విజయవంతమయ్యిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- రాజస్థాన్‌లోని జైపుర్‌లో 78వ సైనిక దినోత్సవ పరేడ్ అట్టహాసంగా జరిగింది.
- ఐసీసీ అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ తొలి మ్యాచ్ లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

=====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు పంజాబ్ చేరుకున్నారు. అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై 463 మంది విద్యార్థులకు డిగ్రీలు, పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... విద్యను సమాజానికి, దేశానికి సేవ చేసే మార్గంలా భావించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు సూచించారు. తమ విద్యకు సహకరించిన సమాజానికి విద్యార్థులు రుణపడి ఉన్నారని.. అభివృద్ధిలో వెనుకబడిన వారిని ఉన్నత స్థితికి తీసుకురావడానికి చేయూతనందించి ఆ రుణం తీర్చుకోవాలన్నారు.

(వాయిస్ 26 సెకన్లు)

రేపు.. జలంధర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికేట్లను ప్రదానం చేస్తారు. అలాగే రెండు “సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్” లను కూడా ప్రారంభిస్తారు.

=====================

కామన్‌వెల్త్ దేశాల స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల 28వ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ హౌజ్ కాంప్లెంక్స్‌లోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్లో ఈరోజు ప్రారంభించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... భారత్ స్వాతంత్ర్యం పొందినప్పుడు.. భిన్న వైవిధ్యాలున్న దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ

సాధించగలదా అనే సందేహాలు ఉండేవని.. కానీ ఆ భయాలను అధిగమించడమే కాకుండా వాటిని భారతదేశ ప్రజాస్వామ్యానికి గొప్ప బలంగా మార్చుకుందని చెప్పారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం అంటే చిట్ట చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సేవలను అందించడమేనని అన్నారు. ప్రభుత్వం ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

అంతకముందు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో.. ప్రజాస్వామ్య సంభాషణ, సహకారం, ఉమ్మడి విలువల గురించి చర్చించడానికి ఈ సదస్సుని నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరునికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సదస్సు వేదికగా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నుంచి సంస్థాగత అభివృద్ధి వరకు.. ప్రపంచ వ్యాప్తంగా చట్టసభలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి పలు సెషన్లలో రేపటి వరకు చర్చిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్‌లోని జైపూర్‌లో 78వ సైనిక దినోత్సవ పరేడ్ ఈరోజు అట్టహాసంగా జరిగినది. ఈ పరేడ్ లో భారత సైన్యానికి చెందిన బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, ధనుష్ ఫిరంగులు, అర్జున్ యుద్ధ ట్యాంకులు, రోబో డాగ్స్, కే-9 వజ్ర వంటి అధునాతన ఆయుధ వ్యవస్థలు, సాయుధ వాహనాలను ప్రదర్శించారు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిలు ఈ పరేడ్ కు హాజరయ్యారు. అంతకముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైనిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, సమగ్రతను పరిరక్షించడంలో సైన్యం దృఢంగా నిలబడుతోందన్నారు. 'దేశానికే తొలి ప్రాధాన్యం' అన్న సైనికుల స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ప్రేరణ అని రాష్ట్రపతి పేర్కొన్నారు. మన సైనికులు అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ దృఢ సంకల్పంతో దేశాన్ని కాపాడుతున్నారని.. వారి కర్తవ్య నిర్వహణ స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి తెలిపారు. 1949లో ఫీల్డ్ మార్షల్ కే ఎం కరియప్ప మన సైన్యానికి మొదటి భారతీయ కమాండర్-ఇన్-చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా జనవరి 15న సైనిక దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు సైన్యం సిద్ధంగా ఉందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు. భవిష్యత్‌ను ఊహించలేమని, అందుకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో 78వ సైనిక దినోత్సవ పరేడ్ తర్వాత ఉపేంద్ర ద్వివేది విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రస్తుత సవాళ్లపైనే కాకుండా.. భవిష్యత్ యుద్ధ సన్నాహాలపై కూడా తీవ్రంగా కృషి చేస్తున్నామన్నారు. ఆ దిశగా కొత్త నిర్మాణాలు చేపట్టి వాటిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక పరికరాలతో సన్నద్ధం చేసి, శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ఈ పరివర్తన ప్రక్రియలో భాగంగా భైరవ్ బెటాలియన్, అశనీ ప్లాటూన్లు, శక్తిమాన్ రెజిమెంట్, దివ్యాస్త్ర బ్యాటరీ వంటి కొత్త యూనిట్లు స్థాపించామన్నారు.

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ ఆయుష్ ఉత్పత్తుల ఎగుమతులు 6 శాతానికి పైగా పెరిగాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. ఈ ఎగుమతుల విలువ 2023-24 సంవత్సరంలో 649 మిలియన్ డాలర్లు ఉండగా.. 2024-25 సంవత్సరానికి 688 మిలియన్ డాలర్లకు పైగా పెరిగిందని సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. ఆయుష్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఏర్పాటుతో ఈ రంగానికి నూతన ఉత్తేజం లభించిందని, ఇది ప్రపంచ వ్యాప్తంగా

భారతీయ సంప్రదాయ వైద్యం, మూలిక ఉత్పత్తులకు ఆదరణ పెంచడంతో పాటు అంతర్జాతీయ డిమాండ్ ను మరింత బలోపేతం చేసిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ అండర్-19 పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ తొలి మ్యాచ్ లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జింబాబ్వే లోని బులవాయో వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా భారత్ కు 107 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో వెలుతురు లేమి కారణంగా అంతరాయం ఏర్పడటంతో డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం మ్యాచ్ ను 37 ఓవర్లకు కుదించి 96 పరుగుల లక్ష్యాన్ని నిర్ణయించారు. 17 ఓవర్లలోనే భారత్ ఈ లక్ష్యాన్ని 4 వికెట్లు నష్టపోయి ఛేదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లను దేశవ్యాప్తంగా విస్తరించనున్నామని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూశాస్త్రాల శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. భారత వాతావరణ విభాగం (IMD) ఈ సంవత్సరం ఢిల్లీ, ముంబై, చెన్నై, పూణే నగరాలలో 50 చొప్పున ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఐఎండీ 151వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... గత దశాబ్దాలతో పోలిస్తే వాతావరణం అంచనా ఖచ్చితత్వం 40 నుండి 50 శాతానికి పైగా మెరుగుపడిందని చెప్పారు. తుఫాన్ల అంచనా ఖచ్చితత్వం దాదాపు 35 నుండి 40 శాతం పెరిగిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా.. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భారతీయులు ఎవరూ ఆ దేశానికి రాకపోకలు చేయరాదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ట్రావెల్ అడ్వైసరీ జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాలు లేదా ఇతర రవాణా మార్గాల ద్వారా వీలైనంత త్వరగా ఆ దేశాన్ని విడిచి రావాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌లో మారుతున్న పరిస్థితులు, అక్కడి గగనతలం మూసివేత నేపథ్యంలో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే తమ విమానాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడుపుతున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =